
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

బుధవారం 8 జనవరి 2025



ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

మాకూ కావాలి ఇల్లు

- ఉమ్మడి జిల్లాలో తుదిదశకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- సొంతిల్లున్నా కూడా దరఖాస్తులు
- సమాధానాలకు విస్తుపోతున్న సర్వే బృందాలు
- 40 వేల ఇళ్లకు 7.40 లక్షల అప్లికేషన్లు
- అర్హుల ఎంపిక కత్తిమీద సామే!

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరింది. సర్వేలో మెదక్ జిల్లా 5వ స్థానంలో ఉండగా, సిద్దిపేట 11వ స్థానంలో, సంగారెడ్డి 20 స్థానంలో ఉన్నాయి. సర్వే పూర్తయ్యే క్రమంలో జిల్లాల స్థానాలు మెరుగుపడనున్నాయి. ఇంటింటా తిరుగుతూ సర్వే చేస్తున్న బృందాలకు విస్తుపోయే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ఆషామాషీ కాదని అర్థమవుతోంది.



ఆంధ్రజ్యోతిప్రతినిధి, సిద్దిపేట, జనవరి 7: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఆరు గ్యారంటీలకు సంబంధించిన 13 సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది. ఇందిరమ్మ ఇంటి కోసం కూడా ఇదే దరఖాస్తులో ప్రత్యేక కాలమ్‌లో పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల ఆధారంగానే ప్రస్తుతం పల్లెల్లో, పట్టణాల్లో ఇందిరమ్మ సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాయి. సర్వే రెండు మూడు రోజుల్లో పూర్తికాబోతున్నది.

ఇల్లున్నా దరఖాస్తు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 7.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇల్లున్నవారే ఎక్కువ మంది ఉన్నట్లు ప్రస్తుతం సర్వే చేస్తున్న బృందాలు గుర్తిస్తున్నాయి. సొంత ఇల్లు ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు ఎందుకు చేశారని ప్రశ్నలు వేస్తుంటే రకరకాల సమాధానాలు వినాల్సి వస్తోందని సర్వే బృందంలోని సభ్యులు వాపోతున్నారు. తమ ఇల్లు పాతబడిందని, చిన్నగా ఉందని, కొడుకులకు కావాలని, మరమ్మతులు చేసుకుంటామని సమాధానమిస్తున్నారు. నివేశన స్థలం లేకున్నా ఇల్లు కోసం దరఖాస్తులు చేసినవారి సంఖ్య బాగానే ఉంది. ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేపై ముఖం చిట్లించిన వారంతా కూడా ఇందిరమ్మ ఇంటి సర్వేకు పోటీ పడి పేర్లు నమోదు చేసుకోవడం విశేషం.

సవాల్‌గా అర్హుల ఎంపిక

నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఖర్చు చేస్తామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 60వేల నుంచి 70వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,500 మందిని ఎంపిక చేయాలంటే కత్తిమీద సాము కానుంది. ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాలు ఉన్నాయి. 11 నియోజకవర్గాలకు 38,500 ఇందిరమ్మ ఇళ్లు వచ్చే అవకాశముంది. అదేవిధంగా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, దూళిమిట్ట, కొమురవెల్లి, మద్దూరు మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం కూడా సిద్దిపేట జిల్లాలో ఉన్నాయి. ఈ మండలాలకు రావాల్సిన ఇళ్లతో కలిపితే 40వేల పైచిలుకు ఇళ్లు ఉమ్మడి మెదక్ జిల్లాకు మంజూరవుతాయి. ఈ లెక్కన 7 లక్షల దరఖాస్తులను పక్కనపెట్టడం అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారనుంది.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

జిల్లా	దరఖాస్తులు	సర్వేపూర్తయినవి	శాతం
మెదక్	1,91,100	1,83,349	96
సిద్దిపేట	2,30,483	2,17,867	95
సంగారెడ్డి	3,18,775	2,96,903	93



దుబ్బాకలో సైకిల్‌పై పండ్లు అమ్ముతున్న కుర్మరాజయ్య

'పండు'టాకు

- 87 ఏళ్ల వయసులో కూడా సైకిల్‌పై ఊరూరా తిరుగుతూ విక్రయం

ఈతరం యువతలో కొందరు పొద్దునే లేవడానికి బద్ధకిస్తుంటారు. ఏ పని చేయాలన్నా వాయిదాలు వేస్తుంటారు. అయితే.. ఈ తాత మాత్రం పొద్దుపొడవకముందే సైకిల్‌పై సవారీ చేస్తూ.. గ్రామాల్లోకి వెళ్లి పండ్లు విక్రయిస్తున్నాడు. కొడుకు సొంత కారు డ్రైవర్, కోడలు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఇంటి పట్టునే ఉండమని వారు ఎంత చెప్పినా కూడా.. ఈ పని చేయకుంటే ప్రాణం ఊరుకోదంటూ.. చిరునవ్వు చిందిస్తున్నాడు దుబ్బాక మండలం దుంపలపల్లికి చెందిన 87 ఏళ్ల కుర్మ రాజయ్య. 50 ఏళ్లుగా ఒకేసైకిల్ తిరుగుతూ.. గంపలో పండ్లను పెట్టుకుని చిన్నపిల్లలకు తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు.. "తాతా... జర ఈ రోజు పైసల్ లేవు.. అని ఎవరైనా అంటే... ఉన్నప్పుడే ఇవ్వు" అంటూ వారికి కావాల్సిన పండ్లను ఇస్తుంటాడు. సైకిల్‌పై తిరిగితే ఆరోగ్యంగా ఉన్నట్లు అనిపిస్తుందని చెబుతున్నాడు. వచ్చిన డబ్బుతో ఎవరిపై ఆధారపడకుండా తాను, తన భార్య కొమురవ్వ చేతికష్టంతోనే చచ్చేవరకూ బతకాలని, తన మనవళ్లకు తన కష్టంతో ఏదైనా కొనిస్తే మనసు తృప్తిగా ఉంటుందంటున్నాడు కుర్మ రాజయ్య. 'పండు'టాకుకు పనిపై ఉన్న పట్టుదలను చూసి పలువురు మెచ్చుకుంటున్నారు.

- దుబ్బాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి)

వందశాతం ఇంటిపన్నును

వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని మున్సిపల్ పరిధిలో వందశాతం ఇంటిపన్నును వసూలు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో ఇంటిపన్ను వసూలుపై రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ వివరాలను పరిశీలించి ఇంటి పన్ను ఇంతవరకు ఎంత మేరకు వసూలు చేస్తున్నారని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపాలిటీ ఆస్తిపన్ను వసూలులో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్చి 31 వరకు ఆస్తిపన్ను వసూళ్లకు సమయం ఉన్నందున, తక్కువ సమయంలోనే త్వరితగతిన పన్ను వసూలు చేయాలని సూచించారు. ప్రతిరోజు టార్గెట్‌ను పూర్తిచేయాలని తెలిపారు. పట్టణంలోని వాణిజ్య వ్యాపారస్తుల వద్ద నుంచి ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పాత బకాయిలు, ప్రస్తుత బకాయిలు తప్పనిసరిగా వసూలు చేయాలని, పట్టణ ప్రజలు, వాణిజ్య వ్యాపారులు సైతం అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ ప్రేరణ, ఏఈఈ పృథ్వీ, ఆర్వో శ్రీకాంత్, ఆర్ఐలు బాలకృష్ణ, భారతీ, అజ్మత్అలీ, బిల్ కలెక్టర్లు, ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల కొరత.. రైతులకు వెత..

- వరినాటుకూ డిమాండ్
- కూలితో పాటు రవాణా, ఇతర ఖర్చులు..
- రూ. 500కు పైగా చెల్లించినా దొరకని వైనం
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు



చిన్నకోడూరు శివారులో వరి నారు తీస్తున్న మహిళా కూలీలు

చిన్నకోడూరు/సిద్దిపేట కలెక్టరేట్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యవసాయ కూలీల కొరత వేధిస్తోంది. ప్రస్తుత కాలంలో వ్యవసాయ పనులు చేయడానికి చాలా మంది సుముఖత చూపడం లేదు. ఈ నేపథ్యంలో వరి నాటు వేయడానికి కూలీల రేట్లు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3.51 లక్షల ఎకరాల్లో వరిసాగు..

వర్షాకాలం సీజన్‌లో వానలు అంతంత మాత్రమే కురిసినా పంటలు సాగు చేసిన అనంతరం భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగాయి. దీంతో బోర్లు, బావిలోకి నీరు చేయడంతో యాసంగి సాగు ఆశాజనకంగానే సాగింది. యాసంగిలో జిల్లాలో 3.86 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉంది. వరి 3.51 లక్షల ఎకరాలు, వేరుశనగ 556, శనగ 420 మొక్కజొన్న 22,793 స్వీట్ కార్న్ 442, పత్తి 64, పొద్దు తిరుగుడు 9,894 పెసర 62, మినుములు 22, కంది 42, ఇతర పంటలు 800 ఎకరాల్లో సాగు చేయనున్నారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వరినాట్లు డిసెంబరు రెండోవారం నుంచి ప్రారంభం కాగా ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాల్లో ఇప్పటి వరకు 94 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది.

వరినాటుకు పెరిగిన డిమాండ్

వ్యవసాయ కూలీలకు సాధారణంగా రోజు కూలి రూ.300నుంచి రూ.350 ఇస్తున్నారు. వరినాటు పనులు ఒకేసారి ఉండడంతో కూలీల కొరత ఏర్పడి, వరినాటుకు డిమాండ్ పెరిగింది. కూలీ రూ.450 నుంచి రూ.500 చెల్లించాల్సి వస్తుంది. ఎకరా పొలం వరి నాటు వేయడానికి సుమారు 10 నుంచి 12 మంది కూలీలు అవసరమవుతారు. ఎకర గుత్తా వరి నాటు వేయడానికి రూ.6వేలకు పైగా చెల్లించాల్సి వస్తుందని, రవాణా ఇతర ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

కూలీలు దొరకడం లేదు



వరి నాటు వేయడానికి కూలీలు దొరకడం లేదు. కూలీలకు మాములు రోజుల్లో ఇచ్చే కూలి కంటే నాటు సమయంలో కూలి ఎక్కువగా ఇవ్వాల్సి వస్తుంది. కూలీలకు కూలితో పాటు రవాణా, ఇతర ఖర్చులు భరించాల్సి వస్తుంది. దీనితో పంట పెట్టుబడికి ఖర్చులు పెరిగాయి.

- నాగరాజు, యువ రైతు, చిన్నకోడూరు

పక్క ఊరు నుంచి తీసుకొస్తున్నం



మా ఊరిలో నాటేసేందుకు కూలీలు దొరక్క పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకొస్తున్నాం. పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకురావడానికి ఆటోచార్జీలు అదనంగా చెల్లించాలి. కూలీల సమస్య తీరేందుకు ఉపాధి హామీ పథకానికి వ్యవసాయం అనుసంధానం చేయాలి.

- లక్ష్మయ్య, రైతు, మగ్దుంపూర్, నంగునూరు

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇక..అటానమస్



గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

గజ్వేల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కో-ఎడ్యూకేషన్)కు అటానమస్ హోదా కల్పిస్తూ యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) మంగళవారం ఉత్తర్వులను వెలువరించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు, గవర్నర్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆర్.మనోహర్ వివరాలతో కూడిన లేఖను పంపించారు. డిసెంబరు 23న జరిగిన కమిషన్ మీటింగ్‌లో ఈ మేరకు స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్ల వరకు అటానమస్‌గా కొనసాగుతుందని, 2025-2026 విద్యాసంవత్సరం నుంచి 2029-2030 విద్యా సంవత్సరం వరకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు యూనివర్సిటీ వచ్చే 30 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులతో గజ్వేల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వయం ప్రతిపత్తితో విద్యార్థులకు ప్రయోజనం చేకూరడంతో పాటు అడ్మిషన్ ప్రక్రియ సులభతరం అవుతుందని, ప్రిన్సిపల్‌కు నిర్ణయాధికారం లభిస్తుందని, ఇది విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుబ్బాక నియోజకవర్గంలో

మరో మూడు పంచాయతీలు!

- వారంలో గెజిట్ నోటిఫికేషన్..!
- దుబ్బాక ఎమ్మెల్యే ప్రతిపాదనలకు ప్రభుత్వం సానుకూలత

దుబ్బాక, జనవరి7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో మరో మూడు మధిర గ్రామాలు.. నూతన పంచాయతీలుగా రూపుదిద్దుకోనున్నాయి. ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ప్రతిపాదనలకు రాష్ట్రప్రభుత్వం సానుకూలతను ప్రకటించింది. దుబ్బాక మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామపంచాయతీలోని మధిర గ్రామం పర్శారాంనగర్(జోడుచర్ల), పద్మశాలిగడ్డ గ్రామపంచాయతీలోని నర్లేంగగడ్డ, అక్బర్‌పేట-భూంపల్లి మండలంకు చెందిన వీరారెడ్డిపల్లి గ్రామపంచాయతీలోని మధిర మాదన్నపేట(కాశిగుడిసెలు) గ్రామాలు గ్రామపంచాయతీగా మారనున్నాయి. ఇందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖా, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు మంత్రి సీతక్కను కలిసి ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి విన్నవించారు. ఆయన విన్నపంతో ఆయా గ్రామాల జనాభా, గ్రామపంచాయతీల ఏర్పాటుకు గల సానుకూలతను, పూర్తి వివరాలను తెప్పించుకున్న ప్రభుత్వం వాటిని గ్రామపంచాయతీలుగా ఏర్పాటుకు చేయడానికి అన్ని రకాలుగా చర్యలను చేపట్టిం ది. జిల్లా యంత్రాంగం కూడా పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించిం ది. ప్రభుత్వం కూడా స్థానిక ఎన్నికల లోపు నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేపట్టింది. ఇందుకు వారంలోపే మూడింటిని గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్టు తెలిసింది. దుబ్బాక మండలంలో 23 గ్రామపంచాయతీలు, అక్బర్‌పేట-భూంపల్లి మండలం 20 గ్రామపంచాయతీలుగా రూపుదిద్దుకోనున్నది.

మల్లన్న చెంత.. తాగునీటి చింత!

- రెండు వాటర్‌ప్లాంట్లు ఉన్నా కానరాని ప్రయోజనం
- మరో రెండు వారాల్లో పట్నం వారంతో జాతర ప్రారంభం
- తరలిరానున్న లక్షలాది భక్తజనం
- మంత్రులు, అధికారుల ఆదేశాలు బేఖాతర్



పనిచేయని మిషన్ భగీరథ నల్లాలు

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):కొమురవెల్లి మల్లన్న భక్తులకు సురక్షిత తాగునీరు కరువైంది. దాహార్తి తీర్చేందుకు ఆలయ పరిధిలో కొన్నేళ్ల క్రితమే రెండు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే, ఆలయవర్గాల నిర్లక్ష్యం వల్ల అవి కాస్తా నిరుపయోగంగా మారాయి. మిషన్ భగీరథ నల్లాలున్నా సంబంధిత అధికారులు నామమాత్రంగా మార్చడం ద్వారా భక్తులకు గుక్కెడు తాగునీటికి నోచుకోక తల్లడిల్లుతున్నారు.

రెండు ప్లాంట్లున్నా.. చుక్కనీరు లేదు..

మల్లన్న భక్తుల తాగునీటి ఇక్కట్లు తెలుసుకున్న ప్రస్తుత మంత్రి, అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ కోటా నిధులు కేటాయించారు. ఆలయ పరిధిలో ప్లాంట్ పరికరాలు బిగించారు. 2019లో జరిగిన మల్లన్న కల్యాణానికి హాజరై ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత ఆలయాధికారులు ప్లాంటు నిర్వహణ విషయాన్ని పట్టించుకోకపోవడంతో అది కాస్తా మూలనపడింది. మల్లన్న భక్తులు యశ్‌పాల్ వీరగోని, ఆకుల సోనియా ఔదార్యంతో విరాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిత్యాన్నదాన సత్ర ఆవరణలో నెలకొల్పిన వాటర్‌ప్లాంట్‌ను జూన్ 5, 2024లో ప్రారంభించారు. కానీ నేటికీ వినియోగంలోకి తీసుకురావడంలో ఆలయవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న భక్తులు

క్యాన్ రూ.100-150 విక్రయం

మూడునెలల పాటు జరిగే జాతర సమయంలో 10లక్షల మంది భక్తులు తరలివస్తారు. భక్తులు నైవేద్యం వండాలంటే నీరు తప్పనిసరి. సరైన నీటి వసతి లేక పోవడంతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ప్రైవేటు దుకాణాదారులు, చిరు వ్యాపారులు అవసరాన్ని బట్టి ఒక్కో క్యాన్‌కు రూ.100-150 చొప్పున విక్రయిస్తుండటంతో భక్తుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కొందరు వ్యవసాయబావుల వద్దకు ఇంటిల్లిపాదివెళ్లి బిందెలు, బకెట్లు, క్యాన్లలో నీటిని మోసుకు(కొ)నితెచ్చుకుంటూ తంటాలు పడుతున్నారు.

మిషన్‌భగీరథ నల్లాలున్నా శూన్యం

ఆలయ తోటబావి ప్రాంగణం, బతుకమ్మ చెరువు పార్కింగ్ ప్రదేశం సమీపంలో మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటుచేశారు. 24గంటలు నీటిని అందుబాటులో ఉంచాల్సి ఉన్నా జాతరలో ఎప్పుడు చూసినా నీటిసరఫరా చేపట్టక అలంకారప్రాయంగా మార్చారు. ప్రకటనలకే పరిమితం తప్ప భక్తులకు ఏమాత్రం ప్రయోజనం ఒనగూరడం లేదు.

ఈ జాతరలోనైనా అందుబాటులోకి తీసుకువస్తారా!

ఈనెల 19న జరగనున్న పట్నంవారంతో మహాజాతర ప్రారంభం కానుంది. లక్షలాదిగా భక్తులు తరలిరానున్న క్రమంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్లాంట్ల మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని, మిషన్ భగీరథ నల్లాలను 24గంటలపాటు నీరు సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయవర్గాలు ఎలాంటి చర్యలూ తీసుకుంటారో వేచిచూడాల్సిందే మరి...

ఉమ్మడి జిల్లా గజగజ

- కోహీర్‌లో కొనసాగుతున్న చలి తీవ్రత
- మంగళవారం 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జనవరి ఒకటో తేదీ నుంచి సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో మండలంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నాలుగు రోజులుగా రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కోహీర్ మండలంలో ఉదయం 9 గంటలైనా బయటికి రాలేనంత తీవ్రత ఉంది. సంక్రాతి వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

కోహీర్ మండల కేంద్రంలో మంగళవారం 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లాలోని అల్గోల్ 10.4, మల్చెల్మ 10.9, న్యాల్‌కల్ 1.2, ఝరాసంఘం 11.2, అల్మాయిపేట 11.4, సత్వార్ 11.7 లక్ష్మీసాగర్ 11.9, మొగుడంపల్లి 12.0, కంగ్టి 12.1, ఆర్సీపురం 12.2, జహీరాబాద్ 12.7, అన్నాసాగర్ 12.8, హత్నూర 12.9, సిర్గాపూర్ 12.9, పుల్కల్ 12.9, రాయికోడ్ 13.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని దామరంచలో 12.3, కొత్తపేట్ 12.4, మనోహరాబాద్ 12.5, చిప్పల్‌తుర్తి 12.7, శివ్వంపేట 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలోని కొండపాక 12.5, అంగడి కిష్టాపూర్ 12.9 మునిగండప్ప 13.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇవేం దారులు..!

- అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు
- ప్రమాదాలు నిత్యకృత్యం
- ఇబ్బందుల్లో ఆయా గ్రామాల ప్రజలు 7



'రైతు భరోసా' పై మాట మార్చడం

మోసగించడమే

- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకుల ధ్వజం 8

కోళ్ల దాణా లారీ బోల్తా

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల దాణా తరలిస్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి శివారు మెదక్-చేగుంట రహదారిపై మంగళవారం జరిగింది. మెదక్ నుంచి మాసాయిపేటకు కోళ్ల దాణాను నింపుకుని వెళ్తున్న లారీ కొర్విపల్లి గ్రామ శివారు వద్దకు రాగానే.. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా లారీని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మహ్మద్ సోఫీకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఐ నారాయణగౌడ్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు లోడుతో వస్తున్న లారీ రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొన్న సంఘటన బిజిలి పూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. శివ్వంపేట మండలం బిజిలి పూర్‌లోని శివశక్తి ల్యాబొరేటరీ పరిశ్రమకు గ్రామం మీదుగానే రోడ్డు ఉన్నది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ బొడ్రాయి సమీపంలోకి రాగానే రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు అంటుకొని టీవీతోపాటు గృహ పరికరాలు కాలిపోయాయని గ్రామస్థులు తెలిపారు. మూడు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలగడంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.



విరిగిన స్తంభాల వైర్లను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. నార్సింగికి చెందిన కృష్ణ హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, తిరుపతి అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి రైల్వే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిలప్‌చెడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మల్లెగారి బాలమణికి చెందిన గేదె కస్తూర్బా సమీపంలో మేస్తుండగా ప్రమాదవశాత్తు 1,100 కేవీ విద్యుత్ తీగ తెగి మీదపడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, అధికారులు ఆదుకోవాలని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



అల్లోల్ చౌరస్తా నుంచి అల్లాన మీదుగా బీదర్ వెళ్లే రోడ్డు



పర్వతాపూర్ నుంచి ఆనెగుంట-జాడిమల్కాపూర్‌కు వెళ్లే దారి



ఝరాసంగం-మేదపల్లి గ్రామాల మధ్య కంకరతేలిన రోడ్డు

గమ్యం.. గగనం

జహీరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజక వర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. అడుగడునా గుంతలు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గతంతో కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల కోసం సుమారు రూ.70కోట్లు మంజూరు చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అప్పట్లో పనులను నిలిపివేశారు. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని రద్దుచేసింది. 2024-24 సంవత్సరానికిగాను నియోజకవర్గంలో 17రోడ్లు 50 కిలోమీటర్లమేర బీటీ వేసేందుకు రూ.35.67 అత్యవసరమని ప్రతిపాదనలను పంపినా నిధులు రాకపోవడంతో రోడ్లు మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఆర్అండ్‌బీ పరిధిలోని 15 పనులకు గాను 115 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. వీటికోసం రూ.49.60 కోట్లు మంజూరైనా, టెండర్లయినా కాంట్రాక్టర్లు పనులు చేయడంలేదు. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో పనులు చేయలేని పరిస్థితి ఉందని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

ఇవేం దారులు..!

ఉమ్మడి జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఏగ్రామానికి వెళ్లాలన్నా గుంతలు, కంకరతేలిన రహదారులే దర్శనమిస్తున్నాయి. పాడైన రోడ్లకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం, కొత్తవి నిర్మించకపోవడంతో అడగడుగునా గుంతలు పడి ప్రాణసంకటంగా మారాయి. దీంతో ఈ దారుల గుండా వెళ్తున్న వాహనదారులు, ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రయాణికుల ఒళ్లు హూనమవుతుండగా, వాహనాలు షెడ్లకు చేరుతున్నాయి. రాత్రిల్లో వాహనదారులు గుంతలు పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. మరమ్మతులకు నిధులున్నా.. టెండర్లయినా పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులు, నిధులకు సంబంధించి ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ బిల్లులు చెల్లిస్తుందోలేదోనని పలువురు కాంట్రాక్టరు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫలితంగా రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇక కొన్ని జాతీయ రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. డేంజర్ జోన్లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల ఏళ్ల కొద్ది నత్తనడకన సాగుతున్న రోడ్లు పనులు కూడా వాహనదారులు, ప్రయాణికులకు శాపంగా మారింది.

ఆంధ్రజ్యోతి ఫోకస్



రోడ్డు మధ్యలో పేరుకుపోయిన దుమ్ము కుప్పలు

దశాబ్దకాలంగా కొనసాగుతూనే..

● ప్రారంభంకాకముందే శిథిలావస్థకు..

రామచంద్రాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేస్తూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గోపన్‌పల్లితండా నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరు వరకు ఓఆర్ఆర్‌ను కలుపుతూ రూ.103.33.67 కోట్ల వ్యయంతో రేడియల్ రోడ్డును నిర్మించతలపెట్టారు. ఈ పనులను 2015లో అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. నేటికి ఈ రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడ రోడ్డు పూర్తయ్యింది.. ఎక్కడ కాలేదన్న దానిపై స్పష్టత లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రేడియల్ రోడ్డు ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటుంది. బీటీ రోడ్డులో గుంతలను ప్రైవేటు వ్యక్తులు రెడిమిక్స్‌తో పూడుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేడియల్ రోడ్డు పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన రహదారి

గతుకులుగా.. గ్రామీణ రోడ్లు

ఝరాసంగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తారు రోడ్లు పూర్తిగా గుంతలమాయంగా, కంకర తేలడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. ఝరాసంగం మండలంలోని మాచూనూర్ నుంచి బర్దీపూర్‌కు వెళ్లే తారు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం చీలపల్లి, చీలపల్లి తండా, న్యాల్‌కల్, నారాయణఖేడ్ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. అదే విధంగా మేదపల్లి నుంచి దిగ్వాల్ వరకు తారు రోడ్డు దెబ్బతింది. ఈ రోడ్డుపై గత ప్రభుత్వ హయాంలో సన్న కంకర వేసి వదిలిపెట్టారు. దీంతో దుమ్ము విపరీతంగా వస్తుండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంగారెడ్డి, హైదారాబాద్ పట్టణలకు ధ్విగాల్ హైవే మీదుగా ప్రయాణం కొనసాగిస్తారు. బోజ్యానాయక్ తండా, పూర్యానాయక్ తండాల రోడ్లు కంకర తేలాయి. నెల రోజుల క్రితం బోజ్యానాయక్‌తండాకు చెందిన మహిళకు పురటి నొప్పులు రావడంతో కాన్పు కోసం ఝరాసంగంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీరా మార్గ మధ్యలోని ప్రసవించింది. తండాల నుంచి కక్కర్‌వాడ గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన బోజ్యానాయక్‌తండా రోడ్డు

రోడ్డు బాగాలేదని బస్సును రద్దు చేసిన ఆర్టీసీ



కొండాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే రోడ్డు దుస్థితి

నర్సాపూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వయా కొండాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నాయపల్లి మీదుగా సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉంది. పలు గ్రామాల ప్రజలు నిత్యం కళాశాలలు, పరిశ్రమలకు ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తారు. హైదరాబాద్ వెళ్లేవారు దీనిపై నుంచే వెళ్తారు. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు పరిధిలోని కొండాపూర్ నుంచి కాగజ్‌మద్దూర్, నత్నాయపల్లి, శేర్‌కాన్‌పల్లి వరకు పదికిలోమీటర్ల మేర రోడ్డు అత్యంత అధ్వాన్నంగా మారింది. అసలే సింగిల్ బీటీ రోడ్డు కాగా, పెద్ద పెద్ద గుంతలతో మట్టి రోడ్డు కంటే దారుణంగా మారింది. రోడ్డు బాగు చేసేంతవరకు ఈ గ్రామాల గుండా బస్సులు నడపమంటూ ఆర్టీసీ ఈ మధ్యనే సేవలు నిలిపివేయడం గమనార్హం.

నిధులున్నా.. టెండర్ ఖరారైనా..

దీన్ని డబుల్‌రోడ్డుగా మార్చేందుకు మూడేళ్ల క్రితమే రూ.2.67కోట్లు మంజూరు కావడంతోపాటు టెండరు కూడా ఖరారైంది. కానీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. పనులు చేపట్టాలని పలుమార్లు అధికారులు నోటీసులు జారీచేసినా ఫలితం శూన్యం. బీఆర్ఎస్ హయాంలో మంజూరు ఈ పనులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందోలేదోనని, తాము ఈ పనులు చేయలేమంటూ ఉన్నతధికారులకు టెండర్లు దక్కించుకున్నవారు ఈ మధ్యనే లేఖ రాసినట్లు తెలిసింది.



రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలు

ప్రమాదాలకు అడ్డాగా..

మనోహరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దండుపల్లి 44 వ జాతీయ రహదారి ప్రమాదాలకు అడ్డగా మారింది. మండలంలో కాళ్లకల్ నుంచి రామాయపల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల మేరకు 44 వ జాతీయ రహదారి పరిధి ఉన్నది. ఈ జాతీయ రహదారి గుండా వారానికి ఒకసారి ఎదో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అతి భారీ వాహనాలు అతి వేగంతో వస్తూ ద్విచక్రవాహనదారులను ఢీకొడుతున్నాయి. బోయినిపల్లి నుంచి కాళ్లకల్ వరకు నూతనంగా 6 లేన్ల రోడ్డు పనులు పూర్తి చేశారు. కాగా, డివైడర్ లేక అక్కడక్కడ రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు కారకాలుగా మారుతున్నాయి. ద్విచక్రవాహన దారులు ఇష్టారితిన మధ్యలో నుంచి రోడ్డు దాటడంతో రాత్రి వేళలలో అతి వేగంగా వస్తున్న భారీ వాహనాలు వారిని ఢీకొడుతున్నారు. నెల రోజుల వ్యవదిలో కాళ్లకల్ జనత హోటల్ చౌరస్తా వద్ద ఇద్దరు మృతి చెందారు. జాతీయ రహదారిపై ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం నిర్వహించిన కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట్ల సూచిక, హెచ్చరికల, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత మనందరి సమష్టి బాధ్యత అన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం విశేష కృషి చేస్తుందన్నారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ, పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రెవెన్యూ పాలన, ధరణి ల్యాండ్, కోర్టు కేసులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఫారెస్ట్ భూ సమస్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీఆర్వో భుజంగరావు, ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, డీఎంహెచ్‌వో డా.శ్రీరామ్, డీటీవో వెంకటస్వామి,మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. అలాగే స్థానిక భరోసా సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న సెల్యూట్ బేస్‌ను ఎస్పీ పరిశీలించారు. స్లాబ్ పనులు ప్రారంభించారు.

నిషేధిత చైనా మాంజా ప్యాకెట్లు స్వాధీనం

● వ్యాపారులపై కేసులు

సదాశివపేట/జహీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న వ్యాపారులపై మంగళవారం స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో చైనా మాంజాలను విక్రయిస్తున్న శివన్నగారి శ్రీను, నక్కలరాజు, బంటు గోపాల్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 148 ప్యాకెట్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. చైనా మాంజాను అమ్మితే 8712656763 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.



చైనా మాంజాల ప్యాకెట్లను చూపుతున్న సీఐ మహేష్‌గౌడ్

మెరుగైన వైద్య సేవలందించాలి

● ఎంపీ రఘునందన్‌రావు



మనోహరాబాద్ మండల ఆశావర్కర్లతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మనోహరాబాద్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన 108 అంబులెన్స్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారితో ఎంపీ బీపీ చెకప్ చేయించుకున్నారు. తమ జీతం రూ.18 వేలు పెంచాలని ఆశా వర్కర్లు ఆయనను కోరారు. ఆరోగ్యం కేంద్రానికి మట్టిరోడ్డు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మనోహరాబాద్ రహదారి వద్ద ఎక్స్‌ప్రెస్ స్టాప్, గ్రామానికి పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలుర మూత్రశాల ఏర్పాటు చేయాలని ఎంపీ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్ రావు. మండల వైద్య అధికారి జష్నాదేవి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, బీజేపీ జిల్లా నాయకులు, విజయ్, సాయిబాబా, అజయ్‌కుమార్, వెంకట్‌గౌడ్, శ్రీకాంత్, వెంకటేష్, ఐలయ్య, నర్సింహులు, అనిల్, బాల నర్సింహులు, మణివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 7: మండలం పరిధి కంచన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పట్లోరి ఫౌండేషన్ అధినేత బాలకిషన్‌రావు రూ.60 లక్షల విరాళం ఇచ్చారు. ఆ నిధులతో అదనపు తరగతి గదులు, ప్రహరీ, మూత్రశాలలు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్‌కిషన్‌రావు అమెరికాలో స్థిరపడినప్పటికీ తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి బడితోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధకిషన్, బీజేపీ నాయకులు మురళీధర్ యాదవ్, మల్లేశంగౌడ్, ఎంఈవో బాల్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జిన్నారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్‌రావుకు స్థానికులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా స్థానిక గండిచెరువు ఎఫ్‌టీఎల్ ముంపుతో వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఆకునూరు యువతి



కనకలక్ష్మి

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన తాటిపాముల కనకలక్ష్మి జాతీయస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాదు దోమలగూడ స్పోర్ట్స్ అథారిటీ హాస్టల్‌లో బీపెడ్ చదువుతున్న కనకలక్ష్మి ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 10-13వరకు అస్సాంరాష్ట్రం గుహవాటిలో నిర్వహిం చనున్న జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం జట్టు తరుపున పాల్గొననుంది. ఈమేరకు కనకలక్ష్మిని హ్యాండ్ బాల్ మెదక్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, కార్యదర్శి రఫత్ ఉమర్‌తో పాటు రాజు, సన్నీ, తాడెం రమేశ్‌లు అభినందించారు.

క్యాంపు రోజే సదరం సర్టిఫికేట్

● హర్షం వ్యక్తం చేసిన దివ్యాంగులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గతంలో సదరం సర్టిఫికేట్ దివ్యాంగుడి చేతికి అందాలంటే సుమారు నెల రోజులు పట్టేది. అదీకూడా డీఆర్‌డీఏ, డీఎంహెచ్‌వో, సర్కారు ఆస్పత్రి చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సర్టిఫికేట్ అందలేదంటూ ప్రజావాణికి ఫిర్యాదులు కూడా వచ్చేవి. ఈ ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి క్యాంపు జరిగిన రోజే సర్టిఫికేట్ జారీ చేసేలా వైద్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో మంగళవారం సదరం క్యాంపు జరిగింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జి.అనీల్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని తొలి రోజు యుద్ధప్రాతిపదికన సుమారు 200 మంది దివ్యాంగులకు సాయంత్రం లోపే సదరం సర్టిఫికేట్లు అందజేశారు. కలెక్టర్, ఆస్పత్రి అధికారులు తీసుకున్న చర్యలతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో దివ్యాంగుడికి సదరం సర్టిఫికేట్‌ను అందజేస్తున్న సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

శివ్వంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చండీ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ మహిళ కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ భిక్షాటన చేస్తున్నది. కాగా మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. చండి పంచాయతీ కార్యదర్శి బర్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం..... వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మటికె సిద్ధయ్య(55) అదే గ్రామానికి చెందిన చంద్రయ్యను 2013లో పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో, రాళ్లతో దాడిచేయగా మృతిచెందాడు. ఈ మేరకు అల్లాదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడు మటికె సిద్ధయ్యకు జీవిత ఖైదుతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

జిన్నారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం సర్వే నెంబరు 10లో గల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ భిక్షపతి ప్రభుత్వ భూమి ఆక్రమణలపై విచారణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరిపినట్లు తేలితే నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 1వ తేదీవరకు గడువు ఉన్నదన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈవో పుష్పవేణి ప్రారంభించారు. పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు.

సుందరీకరణకు నోచని చేర్యాల

● మునిసిపాలిటీగా మారి ఆరేళ్లు గడిచినా అభివృద్ధికి దూరం
● పరిధి విస్తరిస్తున్నా కనిపించని సొబగులు
● జాతీయ రహదారి విస్తరణతో పెరిగిన వాహనాల రాకపోకలు
● రూ.3 కోట్లతో ప్రారంభించినా.. అర్ధాంతరంగా మినీ ట్యాంక్‌బండ్ పనులు



చేర్యాల పట్టణంలోని గాంధీ చౌరస్తా, పెద్దచెరువు కట్టపై మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వాకర్లు

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణాన్ని ఆరేళ్లక్రితం మునిసిపాలిటీగా మార్చినప్పటికీ ఆ పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. అంతర్జాతీయ ఖ్యాతినందించిన నకాశీ చిత్రకళలు చేర్యాలలోనే పురుడు పోసుకున్నప్పటికీ పట్టణ ఔన్నత్యాన్ని, ప్రత్యేకతను ప్రతిబింబింపజేసే గుర్తింపునకు నోచుకోలేదు. చేర్యాలకు మున్సిపాలిటీ హోదా వచ్చినప్పటికీ పాలకుల పట్టింపు లేని ధోరణితో సుందరీకరణకు నోచుకోక 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్నచందంగా మారింది పట్టణ పరిస్థితి.

విస్తరణే తప్ప అభివృద్ధి ఏదీ?

చేర్యాల మునిసిపాలిటీలో 12వార్డులు, 20వేలకు పైగా జనాభా, 5,200కు పైగా జనావాసాలు ఉన్నాయి. నలుదిక్కులా ఎటుచూసినా సుమారు 4కిలోమీటర్ల దూరం పట్టణం విస్తరించినా పట్టణశోభను మాత్రం సంతరించుకోవడం లేదు. పట్టణాభివృద్ధి పట్ల ప్రజాప్రతినిధులు హామీలవర్షం గుప్పిస్తున్నారే తప్ప అమలును పట్టించుకోవడంలేదు. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ప్రజలకు ఆహ్లాదకరవాతావరణం కల్పించే స్థాయిలో ఓ పార్కు సైతం లేకపోవడం గమనార్హం.

కనిపించని సుందరీకరణ

మునిసిపాలిటీ పరిధిలోని జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై జనసమ్మర్థం కలిగిన ప్రధాన జంక్షన్లను సుందరీకరించాలని గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, అప్పటి జిల్లా కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డి పలుమార్లు సూచనలు చేశారు. ప్రతీ మంగళవారం వారాంతపుసంతతో పాటు మునిసిపల్ పాత కార్యాలయం, బ్యాంకు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సు, రైతు బజారు ఉండటంతో ఈ ప్రాంతాలు ఎప్పుడూ జనంతో కళకళలాడుతుంటాయి. అంగడి బజారు చౌరస్తాతో పాటు గాంధీచౌక్‌ను సుందరీకరించాలని గతంలోనే సూచించారు. ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులతో అక్కడ రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఏ విధమైన ఆందోళన కార్యక్రమాలు జరిగినా ఈ రెండు జంక్షన్లలోనే ప్రముఖుల విగ్రహాల వద్ద నిర్వహిస్తుండటంతో ఈ ప్రాంతాలు సందడి ఉంటాయి. కొన్నాళ్ల క్రితమే జాతీయ రహదారిగా విస్తరించడంతో వాహనాల రాకపోకలు మరింత పెరిగాయి.

ఇకనైనా దృష్టి సారిస్తే మేలు

అంగడిబజారు, గాంధీ జంక్షన్ అభివృద్ధికి గతంలోనే మునిసిపల్ నిధులు కేటాయించినా జాతీయరహదారి విస్తరణ పనుల పూర్తి అనంతరం చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రస్తుతానికి విస్తరణ పనులు పూర్తవడంతో ఆయా జంక్షన్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, కొద్ది రోజులక్రితం చేర్యాల మునిసిపాలిటీని సుడాలో విలీనం చేసిన క్రమంలో సిద్దిపేట మాదిరిగా పట్టణ నలుదిక్కులా చేర్యాల ప్రాశస్త్యం, ప్రత్యేకతతో పాటు నకాశీ ఔన్నత్యాన్ని చాటుతూ జంక్షన్ల అభివృద్ధి, స్వాగతబోర్డులు నెలకొల్పాలని, ఆహ్లాదకర వాతావరణం కోసం చెరువులను అభివృద్ధిపరిచి పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగిన మినీట్యాంక్‌బండ్ పనులు

పట్టణానికి రెండువైపులా కుడి చెరువు, పెద్దచెరువులు ఉన్నాయి. పెద్దచెరువును మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దడానికి సుమారు రూ.3కోట్లవ్యయంతో పనులు చేపట్టినా అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రజలకు ఆరోగ్యంపట్ల చైతన్యం పెరిగి మార్నింగ్ వాకింగ్, జాగింగ్, యోగా చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. అయితే ఇందుకు అనువైన స్థలం లేక ఎక్కడపడితే అక్కడే నడక సాగిస్తున్నారు. పెద్దచెరువు కట్టను కొంతమేర విస్తరించడంతో కొంత అనుకూల వాతావరణం నెలకొంది. కొన్నాళ్లక్రితం కట్టపై ఓపెన్ జిమ్ నెలకొల్పడంతో వాకర్ల సంఖ్య పెరిగింది. పర్యవేక్షణ కొరవడటంతో మందుబాబులు ఆగడాలు వాకర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

ప్రకటనలకే సుందరీకరణ పరిమితం

చేర్యాల మునిసిపాలిటీగా మారడంతో నలువైపులా విస్తరించింది. కానీ ఏ ప్రభుత్వం వచ్చినా పట్టణ సుందరీకరణపై దృష్టి సారించలేదు. గాంధీ, అంగడిబజారు, పాత బస్టాండు చౌరస్తాలు పట్టణానికి గుండెకాయలాంటివి. గతంలో నిధులు మంజూరు చేసినా పనులను గాలికివదిలేశారు. పట్టణంలో నకాశీ ఔన్నత్యాన్ని చాటుతూ జంక్షన్లను అభివృద్ధిపరచాలి.

- బూరుగు సురేశ్‌గౌడ్, బీజేపీ రాష్ట్రనాయకుడు

పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేర్యాల పట్టణం అతీగతీలేకుండా పోయింది. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతో చేర్యాల పట్టణంలో జంక్షన్ల అభివృద్ధితో పాటు కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. పట్టణ సమగ్రాభివృద్ధి విషయమై ప్రణాళికలకు రూపకల్పన చేసి ప్రత్యేక నిధుల కోసం కృషి చేస్తున్నాం.

దాసరి శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు

డ్రంకెన్‌డ్రైవ్‌లో 9 మందికి జరిమానా.. ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, జనవరి 7: సిద్దిపేట పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తా ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న 9మందిని పోలీసులు అదులోకి తీసుకున్నారు. పట్టుబడినవారిని మంగళవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం రూ.19వేల జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విద్యార్థులకు మహిళల రక్షణపై అవగాహన



మహిళల రక్షణ, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీమ్

సిద్దిపేట కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మైత్రీవనంలోని క్రాంతి హైస్కూలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు త్రీటౌన్ పోలీసులు, షీ టీం అధ్వర్యంలో మహిళల రక్షణ, సైబర్ క్రైమ్స్, షీటీమ్స్ విధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరమని, రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధల గురించి తెలుసుకోవాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా వేధింపులకు గురి చేసిన, అసభ్యకరంగా మాట్లాడిన డయల్ 100కి గాని, 8712667434 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఏఎస్సై ముజీబ్, సిద్దిపేట షీటీం ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుళ్లు,స్కూలు ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు విధిగా ట్రాఫిక్ రూల్స్, రోడ్డుభద్రత పాటించాలని, లేదా చర్యలు తప్పవని చేర్యాల సీఐ ఎల్ శ్రీను పేర్కొన్నారు. జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా చేర్యాల అంగడిబజారు చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచంచారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు: డీపీవో


రాయపోల్‌లో పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీపీవో

రాయపోల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి పేర్కొన్నారు. మంగళవారం రాయపోల్, లింగారెడ్డిపల్లి గ్రామపంచాయతీలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. లింగారెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. రాయపోల్ కేజీబీవీలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో గదులు ఇరుకుగా ఉన్నాయని, చదువుకోవడానికి పడుకోవడానికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులు డీపీవోకు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు: ఏడీఏ

జగదేవ్‌పూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంట సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్ గ్రామంలో ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్న రైతు మల్లేశంతోటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏవో వసంతరావు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఖలీల్, భాను, కిరణ్ పాల్గొన్నారు.

రేబర్తిలో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలతో పంచాయతీ సెక్రటరి తదితరులు

మద్దూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబర్తి గ్రామంలో సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

చేర్యాలలో రైతుభరోసా సంబరాలు

చేర్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతాంగానికి భరోసా కల్పిస్తూ ఎకరాకు రూ.12వేలు చొప్పున అందించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. ఈసందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, దాసరి శ్రీకాంత్, దాసరి కళావతి, ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల కిష్టయ్య, పలువురు కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

సిద్దిపేట క్రైం, జనవరి 7 :తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం పై దాడి పిరికి పందల చర్య అని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ గుండాయిజం ఆనవాయితీగా ఉంటుందని ఆరోపించారు. కార్యాలయాలపై ఇటువంటి హింసాత్మక దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. జరిగిన సంఘటనకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ ప్రజాస్వామ్యం ఖూని అవుతుందనడానికి ఈ దాడియే నిదర్శనమన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన గుండాలపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

గజ్వేల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గెలిపించి ఆశీర్వదిస్తే ఉపాధ్యాయ లోకం రుణం తీర్చుకుంటామన్నారు.ఆయనవెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్‌శర్మ ఉన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు నాగరాజు

దుబ్బాక, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 28వరకు డిల్లీలో సీసీఈఆర్‌టీలో జరుగుతున్న జాతీయ విద్యావిధానంపై శిక్షణకు మంగళవారం దుబ్బాక మున్సిపల్‌పరిధిలో లచ్చపేట మోడల్‌స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగరాజు ఎంపికయ్యారు. నూతన విద్యావిధానంలో వస్తున్న మార్పులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. జాతీయస్థాయి శిక్షణకు ఎంపికైనా నాగరాజును ప్రిన్సిపాల్ బుచ్చిబాబు అభినందించారు.

ఇందిరానగర్ హైస్కూల్‌కు అవార్డు

సిద్దిపేట కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఇందిరానగర్ హైస్కూలు జిల్లాలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ మేరకు ఓ ప్రైవేట్ టీవీ ఛానెల్ చేపట్టిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్సి అవార్డును దక్కించుకుంది. హైదరాబాద్ నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, శాంతా బయోటెక్ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్ రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

కొండాపూర్‌లో మాక్ పోలింగ్

మిరుదొడ్డి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచు, వార్డు సభ్యుల కోసం మాక్‌పోలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు సర్పంచు పదవి కోసం పోటీ చేశారు. అలాగే వార్డు సభ్యులకు పోటీ చేశారు. విద్యార్థులు మాక్‌పోలింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వప్నారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మన్, స్వప్న, భారతి, లింగం, రాణి, విజయశాంతి, జ్యోతి తదితరులున్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామ సభలు

మద్దూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలో ఉపాధిహామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై మంగళవారం సోషల్ ఆడిట్‌బృందం సభ్యులు సలాఖ్‌పూర్, ధర్మారం, వల్లంపట్ల, గాగిల్లాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై వీఆర్‌పీలు (విలేజ్ రీసోర్స్ పర్సన్స్) నిర్వహించిన సర్వే నివేదికను డీఆర్పీలు గ్రామ సభలో చదివి వినిపించారు.

మిషన్‌భగీరథ సరఫరాపై విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ బృందం తనిఖీ

మద్దూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి గ్రామంలో మిషన్‌భగీరథ ద్వారా అందిస్తున్న నీటి సరఫరాపై మంగళవారం విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ మమత ఆధ్వర్యంలో బృందం సభ్యులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్‌భగీథ వాటర్ ట్యాంకులతో పాటు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో నీటి సరఫరాకు సంబంధించిన 7 రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈఈ మమత, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ బృందం సభ్యులు గోపీ, ఇంట్రా విలేజ్ డీఈఈ కృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రవళిక, సెక్రటరీ మాధవ్ జాదవ్, పంప్ ఆపరేటర్ బాబా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

దౌల్తాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న కెనాల్‌ను పరిశీలించి భూయజమాని భీమయ్యగారి లింగంతో మాట్లాడి కాల్వ నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. అదేవిధంగా సూరంపల్లి ఉబ్బరాజపూర్ గాజులపల్లి గ్రామాల్లో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశు సంపద


మద్దూరు: బంజరలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో జిల్లా పశుసంవర్దకశాఖాధికారి

మద్దూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పశు సంపదను సృష్టించుకోవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బంజరలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. పశువుల సంతానోత్పత్తి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశుసంపద లభిస్తుందన్నారు. పశువులకు సరైన సమయాల్లో రోగ నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువైద్య శిబిరంలో 55 పశువులను వైద్యసేవలు అందించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హరికిషన్, నితిన్‌కుమార్, ఉషారాణి, వీఎల్‌వో పర్వయ్య, రైతులు పాల్గొన్నారు.

● దౌల్తాబాద్: ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ఏడీ కొండల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముబారస్ పూర్ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 28 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 6 పశువులకు గర్భధారణ సూదులు, 20 పశువులకు సాధారణ చికిత్స, 32 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల ఏడీ రాజిరెడ్డి, మండల పశు వైద్యాధికారి పరశురాములు, వీఏ రాజిరెడ్డి, ఓఎస్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


మైనార్టీ హాస్టల్‌లో భోజన సదుపాయాలపై తనిఖీ చేస్తున్న పూజల హరికృష్ణ, అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి):రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తూఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను పూజల హరికృష్ణ, అత్తూ ఇమామ్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో డైట్ మెనూ ప్రకారం మంగళవారం విద్యార్థులకు పెట్టాల్సిన వంటలను చేయలేకపోవడం పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్, కాంట్రాక్టర్ ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కొందరు అధికారులు, సిబ్బంది, వార్డెన్లు తీరు మార్చుకోకుంటే రాష్ట్ర మంత్రులు, సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేలా చేస్తామని హెచ్చరించారు. వార్డెన్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రభుత్వం అందించిన సరుకులను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, బుచ్చిరెడ్డి, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, పాండు, కలీమొద్దీన్, గయాజుద్దీన్, అక్బర్, చోటా అజ్మత్, రాజశేఖర్‌రెడ్డి, కవిత, వనజ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమంగా కేసు బనాయించారు


గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ నేత ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో బీఆర్‌ఎస్ పార్టీని సీఎం రేవంత్‌రెడ్డి అణచివేయాలని చూస్తున్నాడని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌పై అక్రమంగా బనాయించిన ఏసీబీ ఈడీ కేసులలో పసలేదన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో బీఆర్‌ఎస్ నాయకుల మానసిన ధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహారం ఉందన్నారు. ఏడాది కాలంలో అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, జగదేవ్‌పూర్ పాక్స్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు తదితరులున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 17మంది బాధితులకు మంజూరైన రూ.3.91 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో దామరకుంట విద్యార్థిని ప్రదర్శన


రూపొందించిన ప్రాజెక్టుతో కీర్తన, గైడ్ చిన్నబ్రహ్మయ్య

మర్కుక్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జడ్చర్లలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సిద్దిపేట జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట సాయోజు కీర్తన 7వ తరగతి విద్యార్థిని, గైడ్ చిన్నబ్రహ్మయ్య భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించారు. అతి చౌకైన, ఎటువంటి శక్తి అవసరం లేని ట్రేడ్‌మిల్ రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మండల విద్యాధికారి వెంకట్‌రాములు మంగళవారం ఓ ప్రకటనతో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గైడ్ చిన్న బ్రహ్మయ్య, ఎంఈవో వెంకట్‌రాములు, పీఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, కుమార్ తదితరులు అభినందించారు.

వరల్డ్‌వైడ్ పోటీలో విజేతగా సాయి హర్షవర్ధన్



సాయి హర్షవర్ధన్ రెడ్డి అభినందిస్తున్న స్కూల్ చైర్మన్ భగవాన్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన అలామా వరల్డ్ వైడ్ కాంపిటీషన్స్ 2025 విజేతగా సిద్దిపేట మైత్రీవనం క్రాంతి హైస్కూలు విద్యార్థి పి. సాయి హర్షవర్ధన్‌రెడ్డి నిలిచాడు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో అబాకస్, మెంటల్ అర్థిమెటిక్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ హర్షవర్ధన్ సాధించిన విజయం క్రాంతి స్కూలు విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు రాణించడం గర్వకారణంగా ఉందన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన అనిల్‌తో అధ్యాపకులు

దౌల్తాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు దౌల్తాబాద్ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అనిల్‌కుమార్ ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలియజేశారు. కళాశాల విద్యార్థి ఎంపిక కావడానికి కృషి చేసిన పాఠశాల పీడీ సురేష్‌తో పాటు ఎంపికైన విద్యార్థి అనిల్ కుమార్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

9వ తేదీ నుంచి బ్లాక్ స్థాయి క్రీడాపోటీలు

హుస్నాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో హుస్నాబాద్ తాలుకా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తెలిపారు. మహిళలకు కబడ్డీ, షటిల్, వాలీబాల్, రన్నింగ్ పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నామని, 15 నుంచి 29 లోపు వయస్సు గల క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9010030283 నెంబరుకు ఫోన్ చేసి తమ జట్ల వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

'రైతు భరోసా'పై మాట మార్చడం రైతులను మోసగించడమే


సిద్దిపేట రూరల్: రాఘవాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు నచ్చజెప్పుతున్న రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/నంగునూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో రైతు భరోసా, రైతు రుణామాఫీపై మాటమార్చినందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు, ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చందర్ రావు, మోహన్ రెడ్డి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. అదేవిధంగా నారాయణరావుపేట మండల పార్టీ అధ్యక్షులు కోనయ్యగారి ఎల్లయ్య ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి చౌరస్తాలో ముస్తాబాద్-సిద్దిపేట రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి రాస్తారోకో చేస్తున్న వారికి సర్ది చెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అదేవిధంగా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో రాజీవ్ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి ప్లకార్డులతో ధర్నా చేశారు ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి గత వర్షాకాలం రైతుబంధు ఎగ్గొట్టిన రైతు ద్రోహి అని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ బాలకృష్ణ, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. నంగునూరు తహసీల్ కార్యాలయం ఎదుట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఇస్తామన్న రూ.15 వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొర్రీలు లేకుండా రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయాలన్నారు.